



EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శనివారం
19-07-2025
పేజీలు: 02


# రాసుకో.. మరో పదేళ్లు నేనే సీఎం



తెలంగాణ రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా ఎదుగుతున్నా, రాష్ట్రం అభివృద్ధి సాధిస్తున్నా కెసిఆర్‌కు, ఆయన కుటుంబానికి దుఃఖం ముంచుకుని వస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని జటప్రోలు గ్రామంలో శుక్రవారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా పా లన ప్రగతి బాటలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాలమూరు బిడ్డ నైన నేను ఈ మట్టిలో పుట్టి ముఖ్యమంత్రి అయితే కెసిఆర్ కుటుంబం ఓర్వలేకపోతోంది అని ఆరోపించారు. 2034 వరకు నేనే సిఎంగా ఉంటా. పాలమూరు నుంచే పాలన సాగిస్తానని ఛాలెంజ్ విసిరారు. దీ నిని డైరీలో రాసుకో..నీ గుండెల మీద రాసుకో అని కెసిఆర్‌నుద్దేశించి అన్నారు. రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉంటే కెసిఆర్‌కు దుఃఖం ఎందుకని ప్రశ్నించారు. పేదలు బాగుపడుతున్నందుకు దుఃఖమా, నిరుద్యోగ యువతకు 60 వేల ఉద్యోగాలు కల్పించినందుకు దుఃఖమా? మహిళల ఆర్థిక స్వావలంబన కోసం చేస్తున్న అభివృద్ధిని చూసి దుఃఖమా..? పడావు పెట్టిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నందుకు దుఃఖమా..? మీ మనవళ్లు, మనవరాళ్లతో సమానంగా చదువుకునే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నందుకు దుఃఖమా మహిళలకు పెట్రోల్ బంకులు, మహిళా క్యాంటీన్‌లు, ఆర్‌టిసి అద్దె బస్సులకు యజమానులు చేస్తున్నందుకా, అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ఆడబిడ్డలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించినందుకు కెసిఆర్‌కు దుఃఖమా అని ప్రశ్నించారు. లక్ష కోట్లు పెట్టి కాళేశ్వరం నిర్మిస్తే అది మూడేళ్లకే కూలేశ్వరం అయ్యిందని ఆరోపించారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో కట్టిన శ్రీశైలం, నాగార్జున సాగర్, జూరాల వంటి అనేక ప్రాజెక్టులు ఎంత నాణ్యతతో ఉన్నాయో.. కెసిఆర్ హయాంలో కట్టిన ప్రాజెక్టులు ఏ మేరకు నాణ్యతతో ఉన్నాయో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.



## నటుడు ఫిష్ వెంకట్ కన్నుమూత

టాలీవుడ్ సినిమా దగ్గర మరో విషాదం ఇపుడు నెలకొంది. ఇటీవలే కొందరు ప్రముఖులు కన్నుమూశారనే వార్తలు ఎంతో బాధించాయి. కానీ అవి మరిచే లోపే మరో విషాదం చోటు చేసుకుంది. మరో ప్రముఖ నటుడు ఫిష్ వెంకట్ ఇప్పుడు కన్ను మూశారు. అయితే గత కొన్నాళ్ల నుంచి కిడ్నీ సమస్యతో బాధ పడుతున్న ఫిష్ వెంకట్ ఇప్పుడు సరైన సమయంలో డబ్బులు, కిడ్నీ అందక కన్ను మూసారనే మాట తెలుగు ప్రేక్షకులను మరింత బాధిస్తుంది. ఎన్నో సినిమాల్లో నెగిటివ్ పాత్రలు వాటికి మించి కామెడీ పాత్రలు కూడా చేసి అలరించిన ఫిష్ వెంకట్ జీవితం ఇలా ముగుస్తుంది అని ఎవరూ ఊహించలేదు. నిన్న రాత్రి ట్రీట్మెంట్ కి తన శరీరం సహకరించకపోవడంతో తను తుది శ్వాస విడిచారు. ఇది మాత్రం ఒక తీరని విషాదం. మరి వారి పవిత్ర ఆత్మకి శాంతి చేకూరాలని మా 123 యూనిట్ ఆకాంక్షిస్తుంది. ఓం శాంతి.




## గరివిడి లక్ష్మి ఫస్ట్ లుక్

హీరోయిన్ ఆనంది తన అప్ కమింగ్ మూవీ 'గరివిడి లక్ష్మి'లో అద్భుతమైన పాత్రలో కనిపించనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, టిజి కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ సంస్థ ఇటీవలే ఉత్తరాంధ్ర సంప్రదాయాలను అందంగా చూపిస్తూ జానపదం 'నల జిలకర మొగ్గ'తో అందరి మనసులు గెలుచుకుంది. ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఆనందిని లెజెండరీ 'గరివిడి లక్ష్మి' పాత్రలో పరిచయం చేశారు. హాఫ్ శారీ ధరించి, రిక్షాలో కూర్చున్న ఆనంది, ఒడిలో సంగీత వాయిద్యం హార్మోనియంతో చిరునవ్వుతో కనిపించడం ఆకట్టుకుంది. గరివిడి లక్ష్మి ఒక గొప్ప బుర్రకథ కళాకారిణి. 1990లలో ఉత్తరాంధ్ర జానపద సాంప్రదాయాల్ని బతికించి, ప్రజల్లోకి తీసుకెళ్లినందుకు ఆమెకి ప్రత్యేకమైన గుర్తింపు వచ్చింది. ఆమె పేరే ఇప్పుడు ఆ ప్రాంత చరిత్రలో నిలిచిపోయింది. 'గరివిడి లక్ష్మి' గ్రామీణ జీవనానికి, సంగీత వారసత్వానికి అద్భుతమైన నివాళిలా ఉంటుంది. చరణ్ అర్జున్ సంగీతం అందించిన ఈ సినిమా ఉత్తరాంధ్రని ఆవిష్కరిస్తూ మనసుని తాకేలా ఉంటుంది.

## గురుకులాల్లో ఆగని మరణాలు.. ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

రాష్ట్రంలోని గురుకులాల్లో మృత్యుఘోష ఆగడం లేదు. నాలుగు రోజుల వ్యవధిలో ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటికే 8 మంది బలవన్మరణం చెందారు. తాజాగా ఆర్మూర్ పట్టణంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న విద్యార్థి గడ్డం సంతోశ్ (17) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం 7 గంటల సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం తమతో లేచి, అందరితో కలిసి మెలిసి ఉన్నారన్నారు. కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం బయటకు వెళ్లిన సంతోశ్..



చెట్టుకు ఉరి వేసుకున్నట్లు తెలిపారు. మృతుడు నిజాంసాగర్ మండలం ఆరేపల్లికి చెందిన వాడిగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

రంగారెడ్డి జిల్లా, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూర్ ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీని వెనుక నుండి కారు ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులు అ క్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్ర గా యాయ్యాయి. మృతుల్లో మహబూబాబాద్ జిల్లాకు చెందిన గుగులోతు జనార్దన్ (45), వరంగల్ జిల్లాకు చెందిన మాలోత్ చంద్ (29), రంగారెడ్డి జిల్లా, మొయినాబాద్‌కు చెందిన కావలి బాలరాజు ((40), ఎపిలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన భాస్కరరావు (39) ఉన్నారు. పెద్దఅంబర్‌పేట్ నుండి బొంగులూర్ వైపు వెళ్తుండగా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. వీరంతా యాదగిరిగుట్టకు కారులో వెళ్లి తిరిగి వస్తుండగా నిద్రమత్తులో వేగంగా గుర్తు తెలియని లారీని వెనక నుండి ఢీకొన్నట్టు తెలుస్తోంది. కారులోనే ఇద్దరి మృతదేహాలు ఇరుక్కుపోయాయి. మృతులు మొయినాబాద్ గ్రీన్ వాలీ రిసార్ట్‌లో పనిచేసేవారుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన విజయనగరం జిల్లాకు చెందిన జడ కృష్ణ (25) బిఎన్ రెడ్డి నగర్‌లోని నీలాద్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



## భాగీ 4 షూటింగ్‌ని పూర్తి చేసుకున్న సోనమ్ బజ్వా


బాలీవుడ్‌లో భాగీ చిత్రం విజయవంతమైన ఫ్రాంచైజీగా మారింది. ప్రభాస్ యొక్క వర్షం రీమేక్ అయిన భాగీలో టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ రీమేక్ బ్లాక్ బస్టర్ అని తేలింది. ఈ చిత్రం విజయం సాధించినప్పటి నుండి, మేకర్స్ ఫ్రాంచైజీతో ముందుకు వచ్చారు మరియు ఇప్పటికే మరో రెండు భాగాలు యాక్షన్ మూవీ ప్రేమికులను వినోదం పొందటానికి వచ్చాయి. ఇప్పుడు బాగి 4 కి ఎ.హర్షా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఇప్పుడు నటి సోనమ్ బజ్వా ఈ సినిమాలో తన షూటింగ్ ని పూర్తి చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని ప్రొడక్షన్ హౌస్ నటి చిత్రాన్ని పోస్ట్ చేసి ప్రకటించింది. ఈ చిత్రం సెప్టెంబర్ 5న విడుదల కానుంది. ఈ చిత్రంలో సంజయ్ దత్ కూడా కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాని సాజిద్ నదియాడ్‌వాలా నిర్మిస్తున్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షాలు.. తెలంగాణ ప్రభుత్వం అలర్ట్



కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు సంబంధింత అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో వర్షాలపై స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలపై ఎక్కడైనా ఇబ్బ ందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్,హైడ్రా కమిషనర్, పోలీస్ కమిషనర్, వాటర్‌వర్క్స్, ఇతర అధికారులను అప్రమత్తం చేస్తూ వారితో మాట్లాడామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పుకొచ్చారు. ప్రజలు ఆందోళన చెందవద్దని చెప్పారు. హైదరాబాద్ నగరానికి సంబంధించి వర్షపు నీళ్లు ఎక్కడ నిల్వ లేకుండా సిబ్బ ంది వెంటనే తొలగిస్తున్నారని వెల్లడించారు. 141 వాటర్ లాగింగ్ పాయింట్స్‌పై అధికారులు సమన్వయం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజలకి ఏమైనా ఇబ్బ ందులు వస్తే త్వరగా పరిష్కరించడానికి జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రజలు ధైర్యంగా ఉండాలని.. ఏదైనా విపత్తు వస్తే అధికారులకు వెంటనే సమాచారం అందించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## లేడీ హెచ్ఆర్‌తో పాడుపని చేస్తూ అడ్డంగా దొరికిపోయిన సీఈఓ




హెచ్‌ఆర్‌తో సిఇఒ రోమాన్స్ చేస్తూ దొరికిపోయాడు. అమెరికాలోని మసాచుసెట్స్ ప్రాంతం బోస్టన్ నగరంలో జరిగింది. కోల్డ్‌ప్లే కన్సర్ట్‌లో అస్ట్రోనామర్ సిఇఒ అండీ బైరన్, కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ క్రిస్టిన్ కాబట్‌ను కౌగిలించుకొని ముద్దుల వర్షం కురిపించాడు. ఇద్దరు కౌగలించుకోవడంతో కెమెరాకు చిక్కడంతో కాబట్ ముఖం దాచుకోగా బైరన్ పరుగులు తీసి వెనక్కి దాచుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బైరన్‌కు మెగన్ కెర్రిగన్ అనే భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాబట్ కూడా భర్త ఉన్నాడు. మెగన్ తన ఫేస్‌బుక్ ఖాతా నుంచి బైరన్ పేరును తొలగించింది. ఆస్ట్రోనామర్ ఉద్యోగి అలిస్సా కూడా నవ్వుతూ కనిపించడంతో సోసల్ మీడియాలో నెటిజన్లు మండిపడుతున్నారు. సదరు కంపెనీలో విషపూరిత సంస్కృతి ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద కంపెనీకి సిఇఒగా ఉండిని ఇలాంటి పాడు పనులు చేసి సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని నెటిజన్లు మండిపడుతున్నారు.

## 'నువ్వుంటే చాలే' సాంగ్ విడుదల

రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలుకా'. ఈ సినిమాకు టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. 'నువ్వుంటే చాలే' అంటూ సాగే ఈ పాటను చిత్ర యూనిట్ విడుదల చేశారు. ఈ పాటకు ఓ ప్రత్యేకత ఉంది. తొలిసారిగా రామ్ ఈ పాటకి లిరిక్స్ రాశాడు. వివేక్ మరియు మెర్విన్ సంగీతం అందించిన ఈ పాటను ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పాడాడు. ప్రస్తుతం ఈ పాట రామ్ అభిమానులనే కాదు.. కామన్ ఆడియన్స్‌ని కూడా అలరిస్తోంది.



EVENING EDITION
శనివారం | 19 జూలై 2025
www.suryaa.com
4 PM
సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM

## 5 యుద్ధ విమానాలను కూల్చేశారు.. రిపబ్లికన్ నేతలతో ట్రంప్ వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్, భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో అయిదు యుద్ధ విమానాలు కూలినట్లు ట్రంప్ వెల్లడించారు. రిపబ్లికన్ ప్రతినిధులతో జరిగిన డిన్నర్ భేటీలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. కానీ ఏ దేశ యుద్ధ విమానాలు కూలిపోయానన్న విషయాన్ని మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. ఇది నమ్మలేరు, గాలిలోనే విమానాలను పేల్చేశారు. అయిదో నాలుగో.. నాకు తెలిసి అయిదు యుద్ధ విమానాలను కూల్చేశారని ట్రంప్ ఆ మీటింగ్‌లో అన్నారు. ట్రంప్ ఎవర్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశారో స్పష్టంగా తెలియదు. కానీ ఆపరేషన్ సింధూర్ సమయంలో ఈ ఘటన జరిగి ఉంటుందన్న ఉద్దేశం పరోక్షంగా వ్యక్తం అవుతున్నది. ఏప్రిల్ 22వ తేదీన పెహల్గామ్‌లో ఉగ్రదాడి తర్వాత.. మే 7వ తేదీన ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రెండు దేశాల మధ్య అతి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## డ్యూక్ బంతులపై రివ్యూ




ఇండియా, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో వినియోగిస్తున్న డ్యూక్ బంతులపై ఎన్నడూ లేని విధంగా వివాదం కొనసాగుతున్నది. గతానికి భిన్నంగా డ్యూక్ బాల్స్ స్వల్ప వ్యవధిలోనే బంతి ఆకారంతో పాటు మెరుపు కోల్పోతున్నాయి. దీనిపై టీమ్‌ఇండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయగా, మాజీ క్రికెటర్లు తమదైన శైలిలో విమర్శలు ఎక్కుపెట్టారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన బ్రిటిష్ క్రికెట్ బాల్స్ లిమిటెడ్ కంపెనీ బంతుల తయారీపై సమీక్షకు సిద్ధమైంది. లెదర్ నుంచి మొదలుపెడితే ట్యానింగ్ పద్ధతి, బంతి తయారీకి వాడే ముడి పదార్థాలపై అన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని కంపెనీ యజమాని దిలిప్ జజోడియా పేర్కొన్నాడు.



## భట్టి, ఉత్తమ్, పొంగులేటి ఫోన్ల ట్యాపింగ్

సిఎం రేవంత్ రెడ్డి తన సీటుకు ఎసరు పెడతారోననే భయంతో డిప్యూటీ సిఎం భట్టి విక్రమా ర్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల ఫోన్లను ట్యాప్ చే యిస్తున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెం ట్ కెటిఆర్ ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శక్రవారం ఆయన పర్యటించి ఇటీవల మృతి చెందిన మాజీ ఎంఎల్ఎ మదన్ లాల్ కుటుంబ సభ్యులను, మాజీ ఎంఎల్ ఎ రేగా కాంతారావు మాతృమూర్తి మరణం తో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈసందర్భంగా ఖమ్మం బి తెలంగాణ భవనంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ.. సిఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థా యిలో ధ్వజమెత్తారు.ముగ్గురు మంత్రుల ఫోన్లే కాదు..ఇంకా అనేకమంది ఫోన్లను ట్యాపిం గ్ చేస్తున్నారని అన్నారు. ఒకపక్క బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ కేసు వి చారణ చేయిస్తూనే ఎక్కడ తన సీటుకు ముప్పు వస్తుందనే భయంతో మంత్రుల ఫో న్లను కూడా ట్యాపింగ్ చేస్తున్నారని వ్యా ఖ్యానించారు. మంత్రుల ఫోన్లు ట్యాప్ చే యించడం నిజం కాదా ? దమ్ముంటే లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమా ? అని ప్రశ్నించారు.



## రాయలసీమలో ఒక్క ప్రాజెక్ట్‌ను అయినా సాధించారా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబు రాయలసీమను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, రాయలసీమ ద్రోహిగా చరిత్రలో మిగిలిపోయారని వైయస్ఆర్‌సీపీ ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. కర్నూలు జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు చేసిన అన్యాయానికి రాయలసీమ పేరు ఎత్తే అర్హత కూడా ఆయనకు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీమలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చడం కోసం చంద్రబాబు రాజకీయ ప్రస్థానంలో కనీసం ఒక్క ప్రాజెక్ట్‌ను అయినా సాధించారా అని ప్రశ్నించారు. నేడు రాయలసీమను రతనాల సీమ చేస్తానంటూ ఈ ప్రాంత ప్రజలను మోసం చేసేందుకు సిద్దమయ్యారని ధ్వజమెత్తారు. 1998 లో హంద్రీనీవా ప్రాజెక్ట్‌ను కేవలం తాగునీటికే వాడుకోవాలంటూ చంద్రబాబు జీఓ ఇచ్చిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు.

## రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై
# ఎమ్మెల్యే కోమటిరెడ్డి ఫైర్



రాబోయే పదేండ్లూ నేనే ముఖ్యమంత్రిని అంటూ రేవంత్ రెడ్డి ప్రకటించుకోవడాన్ని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. అలా ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకమని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, అలాంటి ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరని ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'రాబోయే పదేళ్లు నేనే ముఖ్యమంత్రి అని రేవంత్ రెడ్డి గారు ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకం. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ లో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుంది. తెలంగాణ కాంగ్రెస్ ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు.' అంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి ట్వీట్ చేశారు.

## మేనల్లుడితో భార్య ఎఫైర్.. భర్త చూశాడని..

ఢిల్లీలోని ఉత్తమ్‌నగర్‌లో వివాహేతర సంబంధం విషాదానికి దారితీసింది. కరణ్ దేవ్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా మరణించగా, మొదట అది కరెంట్ షాక్‌తో జరిగినదిగా భావించారు. అయితే పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ఆయన భార్య తన మేనల్లుడితో ఎఫైర్ పెట్టుకోవడం కరణ్ చూడటం వల్ల అతనికి మత్తుమందులు ఇచ్చి హత్య చేసి కరెంట్ షాక్‌గా నమ్మించే ప్రయత్నం చేసినట్లు వెల్లడైంది. ప్రస్తుతం నిందితులపై కేసు నమోదు చేశారు.

# అర్జున్ కొత్త చరిత్ర



భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ కొత్త చరిత్ర లిఖించాడు. అమెరికా వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో అర్జున్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. తద్వారా ఈ టోర్నీలో సెమీస్‌కు అర్హత సాధించిన తొలి భారత ప్లేయర్‌గా అర్జున్ అరుదైన ఘనత సొంతం చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన క్వార్టర్స్ పోరులో అర్జున్ 1.5-0.5తో నొదిర్బెక్ అబుసత్తోవ్ (ఉజ్బెకిస్థాన్)పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ఈ ప్రపంచ నంబర్ 5 ర్యాంకర్.. ఉజ్బెక్ ప్లేయర్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. నొదిర్బెక్‌తో తొలి ర్యాపిడ్ గెలిచిన అర్జున్.. మలి గేమ్‌ను డ్రా చేసుకున్నాడు.



## తెలుగు రాష్ట్రాల జల వివాదాలపై
# 12 మందితో కమిటీ!

తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలను పరిష్కరించుకునేందుకు కేంద్రం ప్రతిపాదించిన కమిటీలో 12 మంది సభ్యులు ఉండేలా ఇరు రాష్ట్రాలు కసరత్తు చేస్తున్నాయి. ఏపీ, టీజీ నుంచి ఐదుగురి చొప్పున, కేంద్రం తరపున ఇద్దరు సభ్యులను నియమించాలన్న ప్రతిపాదనల మేరకు ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. సోమవారం నాటికి జాబితాను ఖరారు చేసి కేంద్రానికి పంపనున్నట్లు తెలుస్తోంది.

## ఏనుగులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, చర్యలు చేపట్టండి




పార్వతీపురం జిల్లాలో ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ ను వైయస్ఆర్‌సీపీ ఎంపీ గుమ్మ తనూజరాణి కోరారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ను ఎంపీ కలిసి పలు సమస్యను వివరించి వినతిపత్రం అందజేశారు. ఏనుగులతో కోమరాడ, గరుగుబిల్లి, కురుపాం, జియమ్మవలస, బామిని సీతంపేట మండలాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఏనుగుల వల్ల ప్రాణ, ఆస్తి, పంట నష్టాలు జరుగుతున్నాయని, సకాలంలో పంటలు కోయలేకపోతున్నారని వీటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లాలో సుమారు రూ.1.50 కోట్ల ఎంపీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో బెలగాం రైల్వే గేట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి పరిసర గ్రామస్తుల ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎంపీ కోరారు.



# తగ్గని క్రేజ్

చాలా మంది ముద్దుగుమ్మలు అందం అభినయం ఉన్న ఇండస్ట్రీలో ఎక్కువకాలం కంటిన్యూ అవ్వలేకపోతున్నారు. చేస్తున్నా కూడా హిట్స్ మాత్రం అందుకోలేకపోతున్నారు కొందరు. దాంతో కొంతమంది ఇతర భాషల్లోకి చెక్కేస్తున్నారు. మరికొంతమంది సెకండ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇక పై ఫొటోలో కనిపిస్తున్న అమ్మడు ఎవరో గుర్తుపట్టారా.?ఆమె మరెవరో కాదు హాట్ బ్యూటీ కేతిక శర్మ. కేతిక శర్మ 2021లో విడుదలైన రొమాంటిక్ సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. ఆకాష్ పూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఆతర్వాత లక్ష్య అనే సినిమా చేసింది కానీ ఈ సినిమా ఫ్లాప్ అయ్యింది. వైష్ణవ్ తేజ్ తో రంగ రంగ వైభవంగా, అలాగే పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన బ్రో సినిమాలో చేసింది.



## టీటీడీలో అన్యమతస్తులు.. నలుగురు ఉద్యోగులు సస్పెండ్

తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్యమత ఉద్యోగులపై టీటీడీ వేటు వేసింది. ఇతర మతాలకు చెందిన నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. నాణ్యతా విభాగంలో డిప్యూటీ ఇంజినీర్‌గా పనిచేస్తున్న బీ.ఎలిజర్, బర్డ్ దవాఖానలో స్టాఫ్ నర్సు ఎస్. రోసి, గ్రేడ్-1 ఫార్మాసిస్ట్ ఎం. ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో విధులు నిర్వహిస్తున్న జీ.అసుంతను సస్పెండ్ చేశారు. క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నట్లు నిర్ధారణకు వచ్చిన టీటీడీ.. వారిపై ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. హిందూ ధార్మిక సంస్థలో ఉంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహించారని పేర్కొన్నది. కాగా, ఇటీవల (ఈ నెల 11న) తిరుమల శ్రీ వేంకటేశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.. టీటీడీలో 1000 మందికిపైగా అన్యమతస్తులకు ఉద్యోగాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. మసీదులు, చర్చిల్లో బొట్టుపెట్టుకునే హిందువులకు కూడా ఉద్యోగాలిస్తారా? చెప్పాలన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆ అనవాయితీని ఎందుకు కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే వారిని టీటీడీలో ఉద్యోగాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నలుగురు అన్యమతస్తులను టీటీడీ తొలగించడం గమనార్హం.